ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
చిత్తూరు
జిల్లా వార్తలు
మంగళవారం 4 నవంబరు 2025



ఏనుగుల జాడ కోసం.....

కల్లూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సరిహద్దులో ఉన్న తూర్పు విభాగం అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు జాడపై సోమవారం సాయంత్రం డ్రోన్ కెమెరాతో విస్తృతంగా గాలింపు చేపట్టినట్లు ఎఫ్ఎస్‌వోలు మహమ్మద్ షఫి, భారతి, ఎఫ్‌బీవోలు మధు, జమున తెలిపారు. ఆదివారం రాత్రి పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద ఏనుగుల మంద పంటలకు అపారనష్టం కలిగించడంతో అటవీశాఖ అధికారులు వాటి కట్టడికి డ్రోన్ తీసుకొచ్చారు. చిత్తూరు ఈస్ట్ రేంజ్, తిరుపతి జిల్లా పనపాకం రేంజ్ పరిధిలోని అధికారులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే చీకటిపడే సమయానికి అడవిలో ఏనుగుల జాడను డ్రోన్ కెమెరాలు గుర్తించలేక పోవడంతో అధికారులు వెనుదిరిగారు.


డ్రోన్ కెమెరాతో ఏనుగుల జాడను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కార్తీక వెలుగులు

రామకుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):రామకుప్పంలో సోమవారం కార్తీక పూజలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ఉదయం దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.రాత్రి భక్తులు ఆలయాల వద్దకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద, వెనుకన గల త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.


సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద వనాల్లో కార్తీకదీపాల వెలుగులు


సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రయాణికులు, కార్మికులు ప్రభుత్వానికి రెండు కళ్లు

- రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో డిస్పెన్సరీ ప్రారంభం

చిత్తూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు, ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి రెండు కళ్లు అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నూతనంగా నిర్మించిన డిస్పెన్సరీని ఆర్టీసీ చైర్మన్ నారాయణరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు.కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ బాగుంటుందన్నారు. ఇందులో భాగంగానే బస్టాండులోనే నూతన డిస్పెన్సరీని రూ.54 లక్షలతో నిర్మించామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా తీసుకురాలేక పోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,400 నూతనసర్వీసులు తీసుకొచ్చిందని అన్నారు. జనాభాలో సగమైన మహిళల కోసం స్త్రీశక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టారని తెలిపారు. కర్ణాటక, తెలంగాణ కన్నా ఏపీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం చాలా బాగా అమలవుతోందన్నారు. తిరుపతిలో కూడా రూ.3.94 కోట్లతో డిస్పెన్సరీ, ఆర్టీసీ గెస్ట్‌హౌస్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో అనంతపురం, నంద్యాల, హిందూపురంలో డిస్పెన్సరీలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. కార్మికులుల ఆరోగ్యంగా ఉంటే సంస్థ లాభాల్లో ఉంటుందన్నారు. స్త్రీశక్తి పథకం అమలుకు సహకరిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు.ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఎంతో కాలంగా వేచి ఉన్న ఉద్యోగులకు చంద్రబాబు నాయుడు ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల కోసం బస్టాండులోనే డిస్పెన్సరీని ఏర్పాటు చేయించడంపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డిస్పెన్సరీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, వైస్ చైర్మన్ మునిరత్నం, ఆర్టీసీ జోనల్ మేనేజర్ నాగరాజు, చిత్తూరు డీపీటీవో రాము, చుడా చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే.. డిస్పెన్సరీ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్‌లో ఎమ్మెల్యే జగన్మోహన్ ఫొటో లేకపోవడంతో అధికారులపై ఆయన అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆ బ్యానర్‌ను తొలగించారు.

పీహెచ్‌సీల్లో కానరాని 24 గంటల సేవలు



కొన్నింటిలో ప్రసవాలు నిల్ ● కొరవడిన ఉన్నతాధికారుల నిఘా ● నేటినుంచి కేంద్ర బృందం తనిఖీలు

చిత్తూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, పీహెచ్‌సీల స్థితిగతులను పరిశీలించడానికి మంగళవారం కేంద్ర అధికారుల బృందం జిల్లాకు రానుంది.ఆరు రోజులపాటు అంటే 9వ తేదీ వరకు ఈ కామన్ రివ్యూ మిషన్ బృందం జిల్లాలో పర్యటించనుంది.దీంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మూడు రోజులుగా పీహెచ్‌సీల్లో వరుస తనిఖీలు చేసేస్తున్నారు. పీహెచ్‌సీల్లో లోటుపాట్లను సర్దే పనిలో పడ్డారు. జిల్లాలో 48 పీహెచ్‌సీ కేంద్రాలుండగా అన్నీ 24 గంటల ఆస్పత్రులే. కానీ వైద్యం మాత్రం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకే.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వందల కోట్లు ఖర్చు చేస్తున్నా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదు.కొన్ని ఆస్పత్రుల్లోసిబ్బంది లేక గ్రామీణులు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.ప్రతి పీహెచ్‌సీలో కాన్పులు చేయాల్సివున్నా జరక్కపోవడంతో చాలా మంది ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు పెట్టుకుంటున్నారు.ఆగస్టు నెలలో కేవలం 53 కాన్పులు మాత్రమే పీహెచ్‌సీల్లో జరిగినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. అందులో ఒక్క కాన్పు కూడా జరగని పీహెచ్‌సీలు 22 ఉన్నాయి.డీఎంహెచ్‌వో సహా ప్రోగామ్ ఆఫీసర్లు పీహెచ్‌సీల వైపు కన్నెత్తి చూడకపోవడంతో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు.కూలీనాలీ చేసుకొని సాయంత్రం వైద్యం చేయించుకుందామని పీహెచ్‌సీలకు వెళ్తే అక్కడ వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

అవగాహన లేక...

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు జూనియర్లు కావడంతో అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు.సీనియర్లను పక్కన పెట్టి జూనియర్ వైద్యులను ప్రోగ్రామ్ ఆఫీసర్లుగా నియమించి ఆఫీసుకే పరిమితం చేశారన్న ఆరోపణలున్నాయి.బిల్లుల్లో సతకాలు చేయడానికి మాత్రమే పెట్టుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్‌హెచ్‌ఎం నిధులు పక్కదారి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అధిక శాతం కార్యక్రమాలకు నిధులు నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ద్వారా మంజూరవుతుంటాయి.ప్రధానంగా సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు, ఎన్‌సీడీ కార్యక్రమాలు, తల్లీబిడ్డ రక్షణ కార్యక్రమాల అమలకు కోట్లాది రూపాయలు మంజూరవుతున్నాయి.ఈ కార్యక్రమాలపై వైద్యులకు, ఏఎన్ఎంలకు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ కూడా ఉంటుంది. రోజంతా శిక్షణ తరగతులు నిర్వహించి భోజనాలు కూడా పెట్టడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోజనాలు పెట్టినట్లు బిల్లులు పెట్టి తినేస్తున్నారని రాష్ట్ర వైద్య శాఖకు ఫిర్యాదులందినట్లు సమాచారం.

దరఖాస్తులతో వైద్య ఆరోగ్య శాఖకు రూ.10 లక్షల ఆదాయం

చిత్తూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు 56 పోస్టులకు గత నెల 9వ తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. 56 పోస్టులకు మొత్తం 2,093 దరఖాస్తులు వచ్చినట్లు డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. అయితే ఈ దరఖాస్తులు ద్వారా తమశాఖకు రూ.10,46,500 ఆదాయం వచ్చింది. ప్రస్తుతం దరఖాస్తుల స్క్రూటినీ జరుగుతోందని, ఈనెల 7వ తేదీన ప్రొవిజినల్ జాబితా విడుదల చేస్తారని పేర్కొన్నారు.

రెస్కోలో ఉద్యోగాల భర్తీ అబద్ధం

- నమ్మి మోసపోవద్దన్న చైర్మన్ ప్రతాప్

కుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెస్కో (గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ)లో ఉద్యోగాలేవీ అమ్మకానికి లేవని ఆ సంస్థ చైర్మన్ వీజీ ప్రతాప్ అన్నారు. ఉద్యోగాలు తీసిస్తామంటూ ఎవరైనా చెబితే నమ్మి మోసపోకండని ప్రజలను హెచ్చరించారు. స్థానిక రెస్కో ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం డైరెక్టర్లతో కలిసి రెస్కో చైర్మన్ ప్రతాప్ మీడియాతో మాట్లాడారు. రెస్కోలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రజల వద్ద కొంతమంది రూ.2లక్షల నుంచి రూ.5లక్షల దాకా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చేందుకు ఇది వైసీపీ ప్రభుత్వం కాదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో విచ్చలవిడిగా ఉద్యోగాలు ఇచ్చారని, విచారణ కమిటీ నివేదిక కూడా అప్పటి అవినీతిపై నిగ్గు తేల్చిందని గుర్తుచేశారు. కనీసమైన విద్యార్హత, సంబంధిత సాంకేతిక లైసెన్సులు లేకుండా అప్పట్లో చాలామందికి ఉద్యోగాలిచ్చారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో అటువంటి అవకతవకలకు, అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేదన్నారు. అసలు రెస్కోలో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు లేవని స్పష్టం చేశారు. డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇస్తామని చెబుతున్న మోసగాళ్లతో తమకెవరికీ సంబంధం లేదన్నారు. మోసగాళ్లు ఎవరో కనిపెట్టి, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెస్కోలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రమేయం ఈ దందాలో ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.


మీడియా సమావేశంలో రెస్కో చైర్మన్ ప్రతాప్ తదితరులు

పాఠశాలకు ఆలస్యంగా ఎందుకు వచ్చారు?

వంద మంది టీచర్లను వివరణ కోరామన్న డీఈవో

చిత్తూరు సెంట్రల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విధులకు టీచర్లు ఆలస్యంగా రావడంపై వివరణ కోరామని డీఈవో వరలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో వంద మంది టీచర్లు పాఠశాలకు ఆలస్యంగా హాజరైనట్లు గుర్తించామన్నారు. ఆలస్యానికి గల కారణాలు తెలియజేయాలని వారిని కోరామన్నారు. టీచర్లు సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఆలస్యంగా రావడం, త్వరగా వెళ్లిపోవడం వంటివి చేయకూడదని చెప్పారు.

విశ్రాంత ఏవో పెన్షన్ పునరుద్ధరణ

తిరుపతి(వైద్యం), నవంబరు3(ఆంధ్రజ్యోతి):చిత్తూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గతంలో పరిపాలన అధికారి(ఏవో)గా పని చేసిన అరుణాచలానికి పెన్షన్‌లో విధించిన కోతను ఎత్తివేశారు. 2015లో ఏవోగా పనిచేసిన ఎస్.అరుణాచలం తప్పుడు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను క్లెయిమ్ చేసి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో అప్పట్లో విచారణ చేపట్టారు. ఈ కేసు విచారణలో ఉండగా ఆయన 2018లో రిటైరయ్యారు. విచారణ అనంతరం ఆయనకు అందే పించనులో 5 శాతం శాశ్వతంగా కోత విధించాలని అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై అరుణాచలం ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో బాధితుడికి ఎటువంటి కోత లేకుండా పూర్తి స్థాయిలో పించను అందించడంతోపాటు ఆయనకు రావాల్సిన బకాయిలను కూడా అందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనకు రావాల్సిన పెన్షను బకాయిలతో కలిసి నెల లోపు చెల్లించాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వేటగాళ్ల దాష్టీకానికి ఇద్దరి బలి

బంగారుపాళ్యం, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఓ మామిడి తోపులో జంతువులను వేటాడడానికి అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు మృత్యువాతపడ్డ సంఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు .....బంగారుపాళ్యం మండలం కొదలమడుగు పంచాయతీ బండ్లదొడ్డి అటవీప్రాంతంలోని ఓ మామిడి తోటలో జంతువులను వేటాడానికి 500 మీటర్ల మేర బైండింగ్ వైరును అమర్చారు. ఈ వైరు తగలడంతో ఓ అడవి పంది మృతిచెందింది కూడా. అయితే వేట కోసమే బండ్లదొడ్డి గ్రామానికి చెందిన గోవిందస్వామి(32),కుట్టి(45) కూడా ఆ మామిడి తోపులోకి వెళ్లారు. అంతకుముందే అమర్చివున్న బైండింగ్ వైర్లు తగిలి వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఉదయం గ్రామానికి చెందిన కొందరు గమనించిన పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలు పడి ఉన్న విధానం, మృతుల చేతిలో వేటకు ఉపయోగించే విద్యుత్ బైండింగ్ వైర్లు ఉండడంతో వీరు కూడా జంతువులను వేటాండేందుకు మామిడి తోపులోకి వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని సోమవారం ఉదయం డీఎస్పీ డేగల ప్రభాకర్,అటవీ,విద్యుత్ శాఖల అధికారులు పరిశీలించారు. గ్రామంలో వేటకు వెళ్ళే కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గోవిందస్వామి, కుట్టి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


గోవిందస్వామి,కుట్టి మృతదేహాలను పరిశీలిస్తున్న అధికారులు

సబ్ రిజిస్ట్రార్ లేక....

రోజంతా కక్షిదారుల ఎదురుచూపులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ అకస్మాత్తుగా సెలవుపై వెళ్లడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి కక్షిదారులు ఇబ్బందులకు గురయ్యారు. చిత్తూరు రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సగటున 15నుంచి 20దాకా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. వారం పది రోజులుగా వర్షాలతో సతమతమైన కక్షిదారులు సోమవారం మంచి రోజు కావడంతో రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయానికి వచ్చారు. అయితే సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ జిల్లా రిజిస్ట్రార్‌కు సమాచారం ఇచ్చి రెండు రోజుల సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో రిజిస్ట్రేషన్లు చేయాల్సిన సీనియర్ అసిస్టెంట్ ప్రత్యూష కూడా చివరి క్షణంలో అనారోగ్య కారణాలు చూపుతూ సెలవుపై వెళ్లింది.దీంతో ఇక ఆఫీస్‌లో మిగిలింది జూనియర్ అసిస్టెంట్, అటెండర్ మాత్రమే. వీరిద్దరూ రిజిస్ట్రేషన్లు చేసేందుకు నిబంధనలు ఒప్పుకోవు. ఈ వివరాలు తెలియని కక్షిదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్లాట్ బుకింగ్స్ సమయాలకు అనుకూలంగా వచ్చి వేచి చూశారు. చివరికి రిజిస్ట్రేషన్లు జరగవని తెలుసుకుని శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగారు.ఈ వివరాలు సాయంత్రానికి తెలుసుకున్న ఉన్నతాధికారులు మేల్కొని స్లాట్ బుకింగ్ చేసుకున్న కక్షిదారులను మంగళవారం పిలిపించి రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయించారు.


కార్మికురాలిని సన్మానిస్తున్న పట్టాభిరాం, జగన్మోహన్

స్వచ్ఛ చిత్తూరుకు ప్రోత్సాహం

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం

చిత్తూరు అర్బన్, నవంబరు3(ఆంధ్రజోతి): చిత్తూరును స్వచ్ఛ నగరంగా అభివృద్ధి చేయడానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సహకారం అందిస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం చెప్పారు. సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని,అదే సమయంలో బయో డీగ్రేడబుల్‌కవర్లు, క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగుల తయారీ, సరఫరాపై దృష్టి సారించాలన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మెప్మాతో సమన్వయం చేసుకుని బ్యాగుల విక్రయాలకు చర్యలు చేపడతామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చెత్తను తరలించడానికి విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్మికులందరికీ యాక్సిస్‌బ్యాంకుద్వారా రూ. 20లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లుచెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు నగరపాలక పరిధిలో 16 ఎకరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు రూ. 13 కోట్లతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు.50 ఎలక్ట్రిక్ చెత్త తరలించే వాహనాలను అందిస్తామని, కంపాక్టర్లు, సీపింగ్ యంత్రాలను మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఇప్పుడిప్పుడే ప్రజల్లో మార్పు కన్పిస్తోందన్నారు.చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని సోదరబంధం

- పుంగనూరులో విషాదం

పుంగనూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అర్ధ గంట వ్యవధిలో అన్నదమ్ములిద్దరు తనువు చాలించిన వుదంతమిది. పుంగనూరు బజారువీధిలో సోదరులైన ఆర్.పురుషోత్తంశెట్టి(75), ఆర్.రాధాకృష్ణయ్యశెట్టి (67) జనరల్‌స్టోర్ నిర్వహిస్తున్నారు.అన్న పురుషోత్తంశెట్టికి వివాహమైనా పిల్లలులేరు.రాధాకృష్ణయ్యశెట్టికి, వారి సోదరికి వివాహం కాకపోవడంతో అందరూ కలిసే వుంటున్నారు. సోమవారం సాయంత్రం రాధాకృష్ణయ్యశెట్టి (67) బాత్‌రూమ్ వద్ద కాలుజారి కిందపడగా గమనించిన అతని సోదరి దుకాణంలో ఉన్న పురుషోత్తంశెట్టికి విషయాన్ని చెప్పింది. పురుషోత్తంశెట్టి బాత్రూమ్ వద్దకు వెళ్లి పడిపోయిన తమ్ముడిని పైకిలేపుతుండగా ప్రమాదవశాత్తూ తలుపుగడిపై పడడంతో అతని తలకు గాయమైంది. చుట్టుపక్కల వాళ్లు రాధాకృష్ణయ్యశెట్టిని తీసుకొచ్చి హాల్లో పడుకోబెట్టగా ఆయన అప్పటికే మృతిచెందాడు. గాయపడిన పురుషోత్తంశెట్టిని చికిత్సకోసం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఆయన అక్కడ చనిపోయారు. ఒకే కుటుంబంలో ఒకే రోజు, ఒకే గంటలో అన్నదమ్ములిద్దరూ మృత్యువాతపడటంతో విషాదచాయలు అలుముకున్నాయి.


పురుషోత్తంశెట్టి - రాధాకృష్ణయ్యశెట్టి (ఫైల్‌ఫొటోలు)

తిరుమలలో రేపు కార్తీక పౌర్ణమి గరుడసేవ

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం కార్తీక పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. ఆరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మాడవీధుల్లో మలయప్పస్వామిని ఊరేగిస్తారు. కార్తీక మాసంలోని పౌర్ణమి కావడంతో భక్తులు భారీగా వచ్చే అవకాశముందనే అంచనాతో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

వానమామలై జీయర్‌స్వామికి టీటీడీ పెద్ద మర్యాద

తిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముంగునేరి వానమామలై మఠానికి చెందిన పరమహంసేత్యంతి మధురకవి వానామామలై జీయర్‌స్వామి సోమవారం తిరుమల శ్రీవారిని పెద్ద మర్యాదతో దర్శించుకున్నారు. ఉదయం అఖిలాండం వద్ద టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చకబృందం ఆయనకు ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపాన్ని సమర్పించి ఆహ్వానించారు. అనంతరం టీటీడీ పెద్దజీయర్ మఠానికి స్వామి చేరుకోగా ఈవో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. టీడీపీ ఎమ్మెల్యే, విప్ గణబాబు, ప్రభుత్వ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, సినీని ర్మాత ఏఎం రత్నం, బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్ ఉన్నారు.



శ్రీవారి ఆలయం వద్ద తుషార్ కపూర్


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.51 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,442

తలనీలాలు సమర్పించినవారు: 24,692



నా భర్తను చంపేశారు

- పోలీసులు న్యాయం చేయట్లేదు
- పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ఎదుట బాధితురాలి మొర



చంటిబిడ్డతో ఎస్పీని కలిసిన హేమలత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'నాభర్తను మా అత్త, బావ చంపేశారు. పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు' అంటూ బాధితురాలు హేమలత ఎస్పీ సుబ్బరాయుడు ఎదుట సోమవారం పీజీఆర్ఎస్‌లో మొర పెట్టుకున్నారు. 'మాది వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం. సత్యవేడు మండలం మాదనపాలేనికి చెందిన కృష్ణకుమార్‌తో 2023లో నాకు వివాహమైంది. నా భర్తకు అన్న కిరణ్‌కుమార్, సోదరి అశ్విని ఉన్నారు. ఆ తర్వాత నేను డెలివరీ కోసం పుట్టింటికి వచ్చా. ఆ సమయంలో నా భర్త, అతడి అన్న మధ్య ఆస్తుల తగాదాలు చోటు చేసుకున్నాయి. అనంతరం తరచూ గొడవలు జరిగేవి. మా బావ కిరణ్‌కుమార్‌కు మగ బిడ్డ, ఆడ బిడ్డ ఉన్నారు. మాకు మగ బిడ్డ పుట్టడంతో, ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందన్న ఆక్రోశంతో నా భర్తను అంతమొందించాలని పథకం పన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 12న ఇంట్లో ఉన్న నా భర్తపై అత్త వసంతమ్మ, బావ కిరణ్‌కుమార్ దాడి చేయడంతో మృతిచెందారు. నేను అత్తింటికి వెళ్లేటప్పటికే ఖననం చేశారు. నేను భయపడి పుట్టింటికి వచ్చా. వడమాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశా. పోలీసులు కనీసం స్పందించలేదు. ఆ తర్వాత కర్మక్రియలకు వెళ్లగా నాపై నా భర్త మేనమామ కుమారుడు భరత్ కర్రలతో దాడి చేశారు. దీనిపై సెప్టెంబరు 28న ఫిర్యాదు చేశా. న్యాయం చేయాలని పలు సార్లు వడమాలపేట పోలీసులను ప్రాధేయపడినా పట్టించుకోలేదు. చివరకు సెప్టెంబరు 29న కేసు నమోదు చేశారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. నా భర్త చనిపోయిన సమయంలో మా అత్త ఇంట్లో ఉన్న నా పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు ఇప్పించాలని పోలీసులను కోరినా ఫలితం లేదు. ఇప్పటికీ నాకు న్యాయం చేయకపోగా పోలీసుల నుంచి ఒత్తిడి ఉంది. పెళ్లి సమయంలో మా అమ్మ వారు పెట్టిన 10 సవర్ల బంగారు నగలు మా అత్త వద్ద ఉన్నాయి. అవి ఇప్పించండం. నాకు న్యాయం చేయండి' అంటూ ఆమె చంటిబిడ్డతో వచ్చి ఎస్పీ సుబ్బరాయుడిని ప్రాధేయ పడ్డారు. దీనిపై విచారించి, న్యాయం చేస్తామని బాధితురాలికి ఎస్పీ హామీ ఇచ్చారు.

మా బాధలు ఆలకించండి

అధికారులకు అర్జీదారుల వేడుకోలు ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 403 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'కలెక్టరేట్ చుట్టూ వారాల తరబడి తిరుగుతున్నా మా సమస్యలు పరిష్కారం కావడం లేదు. మీరైనా మా బాధలు ఆలకించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. దీపావళి, మొంథా తుఫాన్ కారణంగా గడచిన రెండు వారాలు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించలేదు. దీంతో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎన్నడూ లేని విధంగా 403 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 262 వినతులు వచ్చాయి. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మా ఇంటి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారు



వెంకటగిరి పట్టణంలో 120 ఎకరాలు ఉంది. ఇందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లం. ప్రస్తుతం నీళ్ల లేకపోవడంతో చుట్టుపక్కల లేఅవుట్లు వెలిశాయి. మేమూ అందులో నివాసం ఏర్పరచుకుని ఉన్నాం. మా అనుభవంలో ఉన్న ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు వీఆర్వో, సర్వేయర్ ద్వారా మా సమీప బంధువు నరసింహారావు ప్రయత్నిస్తున్నారు. అతడిపై చర్యలు తీసుకోండి.

- యమున, నాగులగుంట పాళెం, వెంకటగిరి

పట్టా ఇచ్చి ప్లాట్ చూపించలేదు



మేము కూలీనాలి చేసుకుని బతుకుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం ఆర్సీపురం మండలం నెన్నూరు వద్ద ఇంటి పట్టా ఇచ్చారు. తీరా స్థలం చూపించలేదు. నాలుగేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మీరైనా స్పందించి మాకు ప్లాట్ చూపించండి

- గంగ, దామినేడు, తిరుపతి రూరల్ మండలం

పింఛను కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా..



నేను ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడిని. రెండేళ్ల కిందట ప్రమాదం జరిగి కాలు విరిగింది. నడవలేని స్థితిలో ఉన్నా. అంగవైకల్యం కింద పింఛను మంజూరు చేయాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా న్యాయం చేయండి.

- వెంకటాద్రి, రాజీవ్‌గాంధీ కాలనీ, రేణిగుంట

మీరైనా పింఛను ఇచ్చి ఆదుకోండి



అయ్యా నేను పెయింట్ పనిచేసుకునేవాడిని. నాలుగేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో నడవలేని స్థితికి చేరుకున్నా. గత ప్రభుత్వంలో పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయా. మీరైనా ఇచ్చి ఆదుకోండి.

- భాస్కర్, లింగేశ్వర్‌నగర్, తిరుపతి రూరల్ మండలం

గుళూరు చెరువును పరిరక్షించండి

చెరువు కలుజుకు అడ్డంగా కంచె నాటి, చెరువును పూడ్చి ఇల్లు కడుతున్నారు. దీంతో స్వరూపమే మారిపోతోంది. స్పందించి చెరువును పరిరక్షించాలి. చెరువులో ఉన్న పట్టాలను రద్దు చేయాలి.

- గూళూరు చెరువు ఆయకట్టుదారులు, వడమాలపేట మండలం



వైద్య విద్యార్థులపై దాడి ఘటనలో చర్యలు తీసుకోండి



వైద్య విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోండి. రుయా అత్యవసర విభాగంలో పనిచేసే మేము రెండు రోజుల క్రితం విధులు ముగించుకుని అల్పాహారం కోసం వెళుతుండగా వెస్ట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఆపారు. మేము వైద్య విద్యార్థులమని, టిఫిన్ తినడానికి వెళుతున్నామని చెప్పినా వినలేదు. దాడి చేసి, దూషించారు. వారిపై చర్యలు తీసుకోండి.

- ఎస్వీ మెడికల్ కళాశాల విద్యార్థుల డిమాండ్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టీప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టీప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



దీక్షిత్ శెట్టి

పెద్దపంజాణి మద్యం దుకాణానికి దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కేటాయించిన పెద్దపంజాణి ప్రభుత్వ మద్యం దుకాణానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపంజాణి మండలానికి సంబంధించి గాండ్ల ఉపకులానికి ప్రభుత్వం మద్యం దుకాణాన్ని కేటాయించిందని తెలిపారు. ఈ దుకాణానికి సోమవారం నుంచి ఈ నెల పదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సమీపంలోని ఎక్సైజ్‌స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు దారుడు తప్పని సరిగా జిల్లా వాసిగా ఉంటూ.. గాండ్ల ఉపకులానికి చెందినవారై ఉండాలని తెలిపారు. ఈనెల 12వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా మద్యం దుకాణం కేటాయింపు ఉంటుందని వివరించారు.

విద్యార్థుల సమస్యలపై ఆరా



కస్తూర్బా గాంధీ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు రుకియాబేగం

పుంగనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకియాబేగం తెలిపారు. సోమవారం స్థానిక నక్కబండలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వస్తువులు నిల్వ చేసిన గది, విద్యార్థుల వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, చదువులపై ఉపాధ్యాయులు ప్రత్యేకదృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థులకు మంజూరు చేస్తున్న పథకాలను వివరించారు. చిన్న సమస్య వచ్చినా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. చిన్న తనంలో వివాహలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. జిల్లా ప్రాజెక్టు అధికారిణి వెంకటేశ్వరి, సీడీపీవో రాజేశ్వరి పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉంటాం

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకియా బేగం



జిల్లా జైలును సందర్శించిన షేక్ రుకియా బేగం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అండగా ఉంటామని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుకియా బేగం అన్నారు. రెండ్రోజుల జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె ఇటీవల విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన ప్రైవేటు కళాశాలను సందర్శించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసి, వివరాలను ఆరా తీశారు. అనంతరం నగరంలోని సంజీవ్ నగర్‌లోని గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆపై గిరింపేటలోని జిల్లా జైలును సందర్శించారు. ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



ఖాజా మహ్మద్ మృతదేహం

నగరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిలోని బైరాగిపట్టెడకు చెందిన ఎస్.ఖాజా మహ్మద్.. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తన ప్రియురాలితో కలిసి బైక్‌పై చెన్నైలో బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి తిరుపతికి బయల్దేరాడు. సోమవారం ఉదయం 5.15 గంటలకు నగరి మున్సిపల్ పరిధిలోని నెత్తంకండ్రిగ వద్దకొచ్చేసరికి అతివేగంగా బైక్ నడుపుతూ అక్కడున్న బారికేడ్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. బాధితులను నగరి ఏరియా ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అప్పటికే ఖాజా మహ్మద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. యువతికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు నగరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణుల దాడులతో పంటల ధ్వంసం



వరి పొలంలో తిరగాడిన అడవి పందులు

సోమల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు విచ్చలవిడిగా పంట పొలాలపై స్వైరవిహారం చేస్తూ తొక్కివేస్తున్నాయి. ఆదివారం రాత్రి ముండ్రివారిపల్లె సమీపంలోని వరి పొలంలో అడవి పందులు స్వైరవిహారం చేశాయి. అలాగే టమోటా తోటల్లో తిరుగాడి పచ్చికాయలనే తినేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అడవి పందులకు తోడు దుప్పులు, నెమళ్లు విచ్చలవిడిగా పంటలపై పడి రైతులను ఇబ్బందులు పెడుతున్నాయి. రైతులు పొలాల వద్దనే రాత్రి జాగరణ చేసి కాపు కాస్తున్నా ఏదొక సమయంలో పంటలపై విరుచుకుపడుతున్నాయి.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో తనిఖీలు



వైద్యులకు సూచనలు చేస్తున్న ఉన్నతాధికారులు

బంగారుపాళ్యం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొగిలి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను స్టేట్ టీబీ కంట్రోల్ ఆఫీసర్లు సుబ్రహ్మణ్యం, నాగరాజు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్‌సీడీసీపీ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ కిరణ్, మండల వైద్యాధికారి లోహిత్ చెంగల్రాయన్, హెల్త్ సూపర్‌వైజరు రమాదేవి, పలమనేరు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయశంకర్, ఎంఎల్‌హెచ్‌పీలు కుమారి, రవళి, ఏఎన్ఎం చంద్రిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్

● పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలు 364





పీజీఆర్ఎస్ హాలు వద్ద బారులు తీరిన అర్జీదారులు, అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అర్జీదారులు కిక్కిరిశారు. దీపావళి, మొంథా తుఫాన్ కారణంగా రెండు సోమవారాలపాటు పీజీఆర్ఎస్‌ను ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. మూడు వారాల తర్వాత జరుగుతున్న కార్యక్రమం కావడంతో అర్జీదారులు పోటెత్తారు. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డీఆర్వో మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కుసుమకుమారి, ఆర్డీవో శ్రీనివాసులు వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 364 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూ, సర్వేశాఖకు 240, పోలీసుశాఖకు 10, డీఆర్‌డీఏకు 45, వికలాంగులశాఖకు 6, డీఈవోకు 4, డ్వామాకు 5, ఉద్యాన శాఖకు 35, పశు సంవర్ధకశాఖకు 9 అర్జీలుపోను.. మిగిలిన శాఖలకు 10 అర్జీల చొప్పున ఉన్నాయి.

ప్రధాన సమస్యలిలా..

● 90శాతం వికలాంగత్వం ఉన్న తన కుమారుడు గౌతమ్‌కుమార్‌కు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని ఐరాల మండలం నెల్లిమందపల్లెకు చెందిన తాతయ్య విన్నవించారు. తన కుమారుడికి ఒకరుతోడు ఉండి చూసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. పింఛను ఇస్తే ఆస్పత్రి మందులకు ఉపయోగపడుతుందని చెప్పారు.

● పింఛన్ రద్దుపై రాష్ట్ర జిల్లా యంత్రాంగం జారీ చేసిన నోటీసుల్ని పునః సమీక్షించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద పలువురు దివ్యాంగులు నిరసన తెలిపారు. గతంలో ఆస్పత్రి వైద్యాధికారులు ఇచ్చిన సర్టిఫికెట్లతోనే పింఛను మంజూరైందన్నారు. దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నోటీసులను వెనక్కు తీసుకోవాలని, అర్హత పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పోలీసు శాఖకు 47 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్

పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 47 అర్జీలు అందాయి. బాధితుల నుంచి అర్జీలను ఎస్పీ తుషార్ స్వీకరించారు. కుటుంబ తగాదాలపై 14, వేధింపులపై 3, ఇంటి తగాదాలపై 5, భూ తగాదాలపై 14, డబ్బు తగాదాలపై 4, ఆస్తి తగాదాలపై 5, దారి సమస్యలపై 2 చొప్పున అర్జీలున్నాయి.

పింఛను మంజూరు చేయండి



చెక్కును చూపిస్తున్న వెంకటమ్మ

ఒంటరి మహిళకు చేయూత కింద ఇచ్చే పింఛన్‌మంజూరు చేయాలని చేయాలని పలమనేరు మండలం గంటావూరుకు చెందిన ఒంటరి మహిళ వెంకటమ్మ కన్నీళ్లతో మొరపెట్టుకున్నారు. యానాది కులానికి చెందిన తనకు ఎవరూ లేరని, కూలీ పనులకు వెళ్లడం కష్టంగా ఉందన్నారు. ఆమె కష్టాన్ని చూసి కలెక్టర్ సుమిత్‌కుమార్ చలించిపోయారు. వెంటనే రూ.4వేల చెక్కును ఆమెకు అందజేశారు.

నష్టపరిహారం ఇవ్వండి



కలెక్టరేట్‌కు వచ్చిన బాధిత రైతులు

సాగునీటి ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు గ్రామానికి చెందిన రైతులు విజ్ఞప్తి చేశారు. ఉన్న భూములను ప్రాజెక్టుకు ఇవ్వడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం వెంటనే చెల్లించాలని కోరారు.

దారి సమస్య పరిష్కరించండి



జరవారపల్లె గ్రామస్తులు

దారి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గంగవరం మండలం జరవారపల్లె గ్రామస్తులు విన్నవించారు. దారిని కొంత మంది సెటిల్‌మెంట్ భూమి అంటూ ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు.

మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు



ధ్వంసమైన మామిడిచెట్లను చూపిస్తున్న బాధిత రైతులు

కల్లూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కన్నబిడ్డల్లా పెంచుకున్న చెట్లను రాత్రికి రాత్రే ఏనుగుల మంద నేలమట్టం చేస్తున్నాయని అన్నదాతలు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.ఆదివారం రాత్రి పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద పంటలపై ఏనుగుల మంద బీభత్సం సృష్టించాయి. దీంతో మామిడి, వరి, సపోటా పంటలు ధ్వంసం కాగా టేకుచెట్లు నేలమట్టమయ్యాయి. ముందుగా తూర్పువిభాగం అటవీ ప్రాంతంలోని ఎగువచలం నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు అటవీ ప్రాంతం సమీపంలోని కోటపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని వెంకట సుబ్రమణ్యంనాయుడు మామిడితోటలోకి ప్రవేశించిన ఏనుగులు 50 మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. 10 మామిడిచెట్లను పూర్తిగా నేలమట్టం చేసి కొమ్మలను విరిచేశాయి. టేకుచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. ఎకరా పశుగ్రాసాన్ని తినేశాయి. కోటపల్లిలోని రైతులు వీరభద్ర నాయుడు, దామోదర నాయుడు, శ్రీనివాసులు నాయుడు, గంగాధర్, బాబు నాయుడు, మురళీమోహన్, నరసింహులు నాయుడు, భాస్కర నాయుడు, చిట్టెమ్మ, నరేష్, యర్రయ్య, దామోదర్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల మంద విరిచేశాయి. కల్లూరులోని రైతులు సయ్యద్‌బాషా, యుగంధర్‌కు చెందిన వరి, మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. అడవిలోకి వెళుతూ మార్గంలో ఉన్న రైతులు కళావతమ్మ, రామ్మోహన్, సుబ్బరత్న, రెడ్డెమ్మ, ఉదయ్, జయపాల్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకున్నాయి. సోమవారం ఉదయం ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన పంటలను చూసిన బాధిత రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. పంటలపై ఏనుగుల మంద దాడులతో వ్యవసాయంపైనే ఆసక్తి పోతోందని రైతులు వాపోయారు. సోమవారం పగలంతా అడవిలోని దిగువచలం ప్రాంతంలో 16 ఏనుగుల మంద సంచరించినట్లు పశువుల కాపరులు తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీకి యత్నం

● గ్రామస్తులను చూసి పరారైన ముగ్గురు దుండగులు



దొంగలు వదిలేసిన విద్యుత్ వైర్లు, రెండు చాకులు

కల్లూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీ కుమ్మరపల్లి వద్ద సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ తాగునీటి బోరుకు సరఫరా చేసే విద్యుత్ వైర్ల చోరీకి దుండగులు పాల్పడుతూ గ్రామస్తులను చూసి పరారైన సంఘటన కలకలం రేపింది. ఇటీవల మండలంలో దొంగల బెడద ఎక్కువైంది. వ్యవసాయ బోర్లను టార్గెట్ చేస్తున్న దొంగలు విద్యుత్ తీగలను అపహరిస్తున్నారు. ఇటీవల నెల రోజుల్లో వెంకటదాసరపల్లి, దిగువపోకలవారిపల్లి, అయ్యావాండ్లపల్లి, పాళెం, కల్లూరు తదితర పంచాయతీల్లో సుమారు 50 వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ తీగలను అపహరించారు. ఈ నేపథ్యంలోనే దొంగలు ఏ మాత్రం భయపడకుండా పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. కుమ్మరపల్లికి తాగునీరు అందించే బోరు వద్దకు ఓ స్కూటీలో వచ్చిన గుర్తుతెలియని ముగ్గురు దొంగలు విద్యుత్ వైర్లను కట్ చేశారు. దీన్ని గమనించిన గ్రామస్తులు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. గ్రామస్థులను చూసిన ఒక దొంగ స్కూటీ తీసుకొని పరారు కాగా మిగిలిన ఇద్దరు దొంగలు సమీపంలోని గుట్టలోకి పారిపోగా పట్టుకునేందుకు గ్రామస్తులకు సాధ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. దొంగతనానికి పాల్పడిన ప్రదేశాన్ని గ్రామస్తులు పరిశీలించారు. అప్పటికే ఎక్కడో దొంగతనం చేసిన విద్యుత్ వైర్లు, రెండు చాకులను దుండగులు అక్కడే వదిలిపోయినట్లు గుర్తించారు. దీనిపై కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు.

రోడ్డుపై కొండచిలువ కలకలం

యాదమరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలం కాశిరాల పంచాయతీ గాంధీపురం బస్ స్టాపింగ్ సమీపంలోని రోడ్డుపైకి వచ్చిన ఓ పది అడుగుల కొండచిలువ కలకలం సృష్టించింది. దీన్ని చూసిన జనం హడలిపోయారు. కొంతసేపటికి అది రోడ్డుపై నెమ్మదిగా కదులుతూ అడవిలోకి వెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో కొండచిలువలు తరచూ కనిపిస్తున్నాయని, రాత్రివేళల్లో ప్రయాణించాలంటే భయంగా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు మద్దతు ధర రూ.8 ఇవ్వండి



తాజా ఫ్యాక్టరీ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

గుడిపాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఎనిమిది రూపాయలను కచ్చితంగా ఇవ్వాలని మామిడి రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గుడిపాల మండలంలోని సీకే పల్లె వద్ద ఉన్న తాజా మామిడి ఫ్యాక్టరీ సిబ్బందికి మామిడి రైతుల సంక్షేమ సంఘ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మామిడి రైతుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు జిల్లా హరిప్రసాద్‌చౌదరి, కార్యదర్శి ఆనందనాయుడు, ఉపాధ్యక్షుడు లవకుమార్‌రెడ్డి ప్రసంగించారు. రైతులు ఎంతో కష్టపడి నష్టాల్లో కూడా ఫ్యాక్టరీకి మామిడి కాయలు ఇస్తే ఇంతవరకు ప్రభుత్వం ప్రకటించిన ధర ఇవ్వక పోవడం దారుణమన్నారు. కిలో రూ.8 లెక్కన ప్రభుత్వం ప్రకటిస్తే ఫ్యాక్టరీ సిబ్బంది రూ.5,6 ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతుకు రూపాయి తగ్గినా తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, రైతులు రవీంద్రనాయుడు, జగన్నాథనాయుడు, రవినాయుడు, చిట్టిబాబు, బాలసుబ్రహ్మణ్యం, చల్లా, ఎస్టీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ బ్యాంకు మేనేజర్ మాకొద్దు



కొమ్మిరెడ్డిగారిపల్లిలో బ్యాంకు ముందు ధర్నా నిర్వహిస్తున్న ఖాతాదారులు

కల్లూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ముందు సోమవారం ఖాతాదారులు ధర్నా నిర్వహించి, నిరసన తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించలేని ఈ బ్యాంకు మేనేజర్ మాకొద్దంటూ నినాదాలు చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు బ్యాంకు పరిధిలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఖాతాదారులు కొమ్మిరెడ్డిగారిపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ప్రధాన గేటును మూసివేసిన ఖాతాదారులు బ్యాంకు ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. బ్యాంకు ఎదురుగా ఉన్న దామల్‌చెరువు - పులిచెర్ల రోడ్డుపై వెళుతున్న వాహనాలను కొంతసేపు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులు మాట్లాడుతూ వ్యవసాయ రుణాల కోసం బ్యాంకుకు వచ్చే రైతుల పట్ల మేనేజర్ చులకనగా చూస్తున్నాడన్నారు. డ్వాక్రా రుణాలు తీసుకునే మహిళల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయమని ఒత్తిడి తేవడం మేనేజర్‌కు సరికాదన్నారు. బంగారు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాలని బ్యాంకుకు వచ్చే ప్రజలను రోజుల తరబడి తిప్పించుకోవడమేంటని ప్రశ్నించారు. ఈ మేనేజర్‌పై ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖాతాదారులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ట్రైనీ ఎస్‌ఐ మధుసూదన్ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ఖాతాదారుల సమస్యలపై ముందుగా బ్యాంకు మేనేజర్ ఉమామహేశ్వరరావుతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు చర్చించారు. ఖాతాదారులు ఎదుర్కొంటున్న సమస్యలను బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి ఎస్‌ఐ తీసుకెళ్లారు. దీంతో బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రొంపిచెర్ల, కల్లూరు, మంగళంపేట ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్లు అశోక్‌కుమార్, నాగేశ్వరరావు, వేన్‌ధన్‌లు కొమ్మిరెడ్డిగారిపల్లి బ్యాంకు వద్దకు చేరుకొని స్థానిక మేనేజర్‌తో మాట్లాడారు. ఖాతాదారుల సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఖాతాదారులు ధర్నాను విరమించారు.

● **నిబంధనల మేరకు సేవలందిస్తాం**

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నిబంధనల మేరకు ఖాతాదారులకు సేవలందిస్తామని బ్యాంకు మేనేజర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇటీవల బ్యాంకులో సాఫ్ట్‌వేర్‌లు మార్చడం, నెట్‌వర్కు సమస్య కారణంగా ఖాతాదారులకు సేవలందించడంలో ఆలస్యం జరుగుతోందన్నారు. డ్వాక్రా రుణాలు తీసుకునే మహిళలను డిపాజిట్లు చేయమని ఒత్తిడి చేయడం లేదన్నారు. ఖాతాదారుల పట్ల ఎలాంటి చులకన భావం లేదని మేనేజర్ వివరణ ఇచ్చారు.

చిత్తూరుకు ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న పట్టాభిరాం, జగన్మోహన్

చిత్తూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ డంపింగ్ యార్డులో వ్యర్థాలను డిసెంబరుకల్లా తొలగించి జనవరి నుంచి గ్రీనరీ పనులు మొదలు పెట్టాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి సంతపేటలోని డంపింగ్‌యార్డును ఆయన పరిశీలించారు. బయోమైనింగ్ పనులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. బయోమైనింగ్ కోసం రూ. 13కోట్లు ఖర్చు పెడుతున్నా పనులు వేగంగా జరగడం లేదన్నారు. బయోమైనింగ్ తరువాత వచ్చే వ్యర్థాలను ఏ విధంగా తరలిస్తున్నారు, సిమెంటు ఫ్యాక్టరీలకు ఎంత తరలిస్తున్నారు, ఔట్‌పుట్ ఎంత వస్తుందని ఆరా తీశారు. స్వచ్ఛాంధ్ర సాఫ్ట్‌వేర్‌లో ఎందుకు ఇంటిగ్రేట్ కాలేదని, రోజు వారీ వివరాలను ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ కోసం చిత్తూరు నగరానికి ఒక ప్లాంట్‌ను మంజూరు చేస్తామని, ఇందుకోసం స్థలాన్ని కేటాయించాలన్నారు. మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, పబ్లిక్ హెల్త్ డీఈ పుష్పగిరినాయక్, టీడీపీ నేతలు వెంకటేష్ యాదవ్, యువరాజులు నాయుడు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కేదారేశ్వర నోములు



నోముల వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

చౌడేపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేదారేశ్వర నోములను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. కార్తీక సోమవారం సందర్భంగా స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టదమృత్యుంజయేశ్వర ఆలయంలో స్వామి వారికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు భక్తులకు కేదారీశ్వర నోముల వ్రత కథను వివరించి, వ్రతాన్ని ఆచరింపచేశారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

శైవక్షేత్రాల్లో భక్తుల సందడి

సోమల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవ క్షేత్రాలు కార్తీక సోమవారంతో భక్తులతో కిటకిటలాడాయి. సోమల స్వయంభేశ్వరాలయంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణచేసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కేదారేశ్వర గౌరీ నోములు నోచుకునే భక్తులతో సందడిగా మారాయి. అర్చకులు విద్యాసాగర్ గౌరీదేవి వ్రత విధానాన్ని భక్తులకు వివరించారు. దుర్గంకొండ, ఇరికిపెంట నేలమల్లేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయం, రెడ్డివారిపల్లె ఈశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. సోమల, దిడ్డివారిపల్లె, సూరయ్యగారిపల్లె, కరకమంద గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయం వద్ద జంతుబలులు జరిపి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

టీడీపీ పటిష్ఠతకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, రాజగోపాల్ తదితరులు

కుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయకులందరూ సమన్వయంతో టీడీపీ పటిష్ఠతకు కృషి చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మండలం గుడ్లనాయనిపల్లె పంచాయతీ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలని నాయకులకు సూచించారు. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పం మండలంలో టీడీపీ క్లీన్ స్వీప్ చేయడానికి ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజగోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత పార్టీ శ్రేణులదేనని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం

కుప్పం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం సోమవారం కుప్పం పర్యటనకు విచ్చేశారు. ప్రభుత్వ రహదారులు - భవనాల శాఖ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, రెస్కో చైర్మన్ వీజీ ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, కౌన్సిలర్ దాము, క్లస్టర్ ఇన్‌చార్జి సోము, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, టీడీపీ నాయకుడు గోపీనాథ్, కన్నన్ తదితరులు ఘన స్వాగతం పలికారు. శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అమరనాథ్ గౌడ్ ప్రమాణ స్వీకారం



అమరనాథ్ గౌడ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సదుం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విజయవాడ పద్మావతి నగర్‌లోని విశాల్ రెసిడెన్సీలో ఏపీ వెనుకబడిన తరగతుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సదుం టీడీపీ నేత గుండ్లపల్లె అమరనాథ్ గౌడ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. పుంగనూరు నియోజకవర్గం పరిధిలోని టీడీపీ నేతలు, యాదవ కులసంఘ నాయకులు, పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణుల సందడి నడుమ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా యాదవ కుల సంఘ నాయకులతోపాటు పలువురు మండల టీడీపీ నాయకులు బొకేలతో అమరనాథ్ గౌడ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి పదవిలో నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి, పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లా బాబు, టీడీపీ కుటుంబసభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సదుం మండల టీడీపీ అధ్యక్షులు రెడ్డి ప్రసాద్ రెడ్డి, యాదవ సంఘం నాయకులు నారాయణ గౌడ్, కుమార్, దేవేంద్ర యాదవ్, కృష్ణమూర్తి యాదవ్, నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మారుతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మంగళం గ్రామంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై వైసీపీ నాయకులు ఉనికిని కాపాడుకోవడానికి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.సీఐ సుబ్బరాయుడు, నాయకులు మాధవ్, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్, రమణ, సుబ్రహ్మణ్యం, పాముల హరి తదితరులు పాల్గొన్నారు.

పొగ మంచుతో తప్పని తిప్పలు



సోమల-తిరుపతి రహదారిలో కురుస్తున్న మంచు

సోమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోమలలో ఉదయం 8గంటలు దాటినా పొగ మంచు కురుస్తుంది. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె వంటి అటవీ శివారు గ్రామాల్లో ఉదయం 9 గంటల వరకు పొగ మంచు వీడడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. పాడి రైతులు తమ పొలాల వద్ద ఆవుల నుంచి పాలు పితికి డిపోలకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. కార్తీక మాసం కావడంతో గృహిణులు ముగ్గులు వేసేందుకు పొగ మంచుతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇతర పట్టణాల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. మంచు దెబ్బతో టమోటా తోటలకు చీడపీడలు వ్యాప్తి చెందుతున్నాయని, కాయలు నాణ్యత ఉండటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో మహిళా కమిషన్ సభ్యురాలి తనిఖీ



రుకియాబేగంకు స్వాగతం పలుకుతున్న పోలీస్ అధికారులు

గంగవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకియాబేగం పలమనేరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం తనిఖీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన బాలికలు, మహిళల మిస్సింగ్, పోక్సో కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు సీఐ మురళీమోహన్, ఎస్ఐ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహిళా కమిషన్ సభ్యురాలి పర్యటన

చౌడేపల్లె, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియాబేగం మంగళవారం చౌడేపల్లె మండలంలో పర్యటించనున్నట్లు సీడీపీవో రాజేశ్వరి పేర్కొన్నారు. రుకియాబేగం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను దర్శించుకుంటారు. మండలంలో ఇటీవల జరిగిన బాలికల అదృశ్యం, అంగన్‌వాడీ కేంద్రాలు, చౌడేపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తారు.

కోడి పందేల స్థావరంపై దాడి

- ముగ్గురి అరెస్టు

రొంపిచెర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల - పులిచెర్ల మార్గంలో రామాపురం కంకర ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం కోడిపందేల స్థావరంపై రొంపిచెర్ల పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో ముగ్గురిని అరెస్టు చేసి, రెండు కోళ్లు, రూ.2,100లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



లతీఫ్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు సోమవారం తెలిపారు. పట్టణంలో కొత్తయిండ్లుకు చెందిన లతీఫ్ (48) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. లతీఫ్ పెద్దపంజాణి మండలం చిన్నపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన మృతికి పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు



చికిత్స పొందుతున్న రాజమ్మ

రొంపిచెర్ల, నవంబరు 3: (ఆంధ్రజ్యోతి): తిరుపతి - మదనపల్లె జాతీయరహదారిలో సోమవారం ఉదయం రొంపిచెర్ల క్రాస్ వద్ద రోడ్డు దాటుతున్న మండలంలోని జగడంవారిపల్లెకు చెందిన వృద్ధురాలు రాజమ్మకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆమెను చిన్నగొట్టిగల్లు ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. కేసు నమోదు చేయలేదని హెడ్‌కానిస్టేబుల్ చంద్ర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

రామకుప్పం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ననియాల-ఎస్.గొల్లపల్లె రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు... రామకుప్పం మండలం పీఎంకేతండాకు చెందిన దేవానాయక్(49) గతనెల 14న ద్విచక్రవాహనంలో వీర్నమలకు వెళ్లాడు. అక్కడ చనిపోయిన బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యంలో ననియాల-ఎస్.గొల్లపల్లె రహదారిలో ద్విచక్రవాహనానికి జింక అడ్డురావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి తీవ్రగాయాలకు గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని చికిత్స కోసం కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

వి.కోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసులో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం స్టేషన్ ఆవరణలో ఈ వాహనాలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నేతృత్వంలో వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు నిర్ణీత మొత్తం డిపాజిట్టు చెల్లించి పాల్గొనాలన్నారు.

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీపై ఫిర్యాదు

పుంగనూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తన సంతకాన్ని ఫోర్జరీ చేశారంటూ పుంగనూరు మండలం మోదుగులపల్లె పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం మేరకు... మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నెకి చెందిన జి.వెంకటరమణ మోదుగులపల్లె పంచాయతీకార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని పూజగానిపల్లెకు చెందిన కె.నాగప్ప కుమారుడు కె.వెంకటరమణ ఇంటిపై రుణాలు తీసుకోవడానికి సర్టిఫికెట్ కావాలని తనవద్దకు రాగా, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇంటి పన్ను తప్ప ఇతర సర్టిఫికెట్లు ఇవ్వలేనని చెప్పానని వివరించారు. కె.వెంకటరమణ గ్రామ పంచాయతీ సీలు తయారుచేసి తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు సమాచారం వచ్చిందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు.

బాలిక ఆత్మహత్యపై పకడ్బందీగా విచారణ



వివరాలు వెల్లడిస్తున్న సీఐలు మురళీమోహన్, పరశురాముడు

గంగవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల పరిధిలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై బాధితుల ఫిర్యాదుమేరకు పకడ్బందీగా విచారణ చేపడుతున్నామని పలమనేరు అర్బన్, రూరల్ సీఐలు మురళీమోహన్, పరశురాముడు పేర్కొన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ పలమనేరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న బాలిక ఆదివారం ఉదయం ఆత్మహత్య చేసుకొన్న సంఘటన తెలియగానే, సంఘటనా స్థలం వద్దకు చేరుకొని విచారించామన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. అయితే సోమవారం మృతురాలి తల్లిదండ్రులు మా కుమార్తె మృతికి మార్లపల్లె గ్రామానికి చెందిన హేమరాజు అనే ఎంబీఏ విద్యార్థే కారణమని ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసును అన్నికోణాల్లో విచారించి, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేపు మృత్యుంజయేశ్వరాలయంలో

కార్తీక దీపోత్సవం



మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం వ్యూ



కార్తీక దీపోత్సవానికి సిద్ధమవుతున్న 80 అడుగుల రాతి ధ్వజస్తంభం

చౌడేపల్లె, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కార్తీక దీపోత్సవం ఈ నెల 5న మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా జరుగుతుంది. సోమవారం ఆలయంలో ఉన్న 80 అడుగుల రాతి ధ్వజస్తంభంపై ఉభయదారులు దిండికుర్తి సుధాకర్‌బాబు కుటుంబీకుల ఆధ్వర్యంలో అఖండ దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించుట, జ్వాలా తోరణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు రాజశేఖర్ దీక్షితులు తెలిపారు. 16వ శతాబ్దంలో పుంగనూరు జమిందారులు నిర్మించిన అత్యంత పురాతనమైన ఆలయంగా, భక్తుల కొంగు బంగారంగా కోరిన కోరికలు తీరుస్తూ, మృత్యు గండాలను తొలగించే అభీష్టద మృత్యుంజేయేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం వైభవంగా జరుగనుంది.

పొలాల వద్ద అక్రమంగా కరెంటు తీగలు లాగితే క్రిమినల్ చర్యలు

సదుం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను వేటాడే నెపంతో ఎవరికీ తెలియకుండా పొలాల వద్ద అక్రమంగా కరెంటు తీగలు లాగిన వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని అటవీ, విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గత ఆదివారం బంగారుపాళ్యం మండలం బండ్లదొడ్డి పంచాయతీ పరిధిలో పొలాల వద్ద లాగిన విద్యుత్ తీగల బారిన పడి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందడంతో అటవీ శాఖ సిబ్బంది తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పొలాల వద్ద అక్రమ విద్యుత్ లాగినట్లు తెలిస్తే వెంటనే అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ప్రజలను వారు కోరారు.

ఆదర్శంగా కుప్పం మున్సిపాలిటీ

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం



కుప్పంలో డంపింగ్ యార్డును సందర్శించి అధికారులకు సూచనలిస్తున్న పట్టాభిరాం, ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు శక్తివంచన లేకుండా శ్రమించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం అన్నారు. కుప్పం పురపాలక సంఘానికి ఆయన సోమవారం సాయంత్రం విచ్చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పురపాలక సంఘం 9వ వార్డు, మోడల్ కాలనీ పరిధిలో పర్యటించారు. ఇదే ప్రాంతంలో గల డంపింగ్ యార్డును పరిశీలించారు. అనంతరం కుప్పం మున్సిపాలిటీలో అమలవుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమం తీరుతెన్నులపై అధికారులతో సమీక్ష జరిపారు. ఇక్కడ జరుగుతున్న వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమం గురించి కడా పీడీ వికాస్ మర్మత్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావులు ఆయనకు వివరించారు. డంపింగ్ యార్డును ఆధునిక శైలిలో అభివృద్ధి చేయడంవల్ల స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఊతం లభిస్తుందని పట్టాభిరామ్ అన్నారు. డంపింగ్ యార్డు ఆధునికీకరణకు సంబంధించి పట్టాభిరాం పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోని ప్రధానమైన కుప్పం మున్సిపాలిటీలో చెత్త రహిత పాలనకు ప్రథమ ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, టీడీపీ 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్, జనసేన అధ్యక్షుడు నరేశ్, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ర్యాంకులు సాధించేలా పనిచేయాలి

గంగవరం (ఆంధ్రజ్యోతి): ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉంటూ జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించేలా మున్సిపల్ సిబ్బంది, కార్మికులు కలిసికట్టుగా పనిచేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పలమనేరు కంపోస్టుయార్డును తనిఖీ చేసి, అక్కడ చెత్తను వేరుచేసే విధానం, పొడిచెత్త, తడిచెత్త నిల్వలు, చెత్తతో కంపోస్టు ఎరువును తయారు చేసే విధానాన్ని తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో కార్మికుల కోసం కూటమి ప్రభుత్వం ఉచిత బీమా సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో పలమనేరు, చిత్తూరు మున్సిపల్ కమిషనర్లు రమణారెడ్డి, నరసింహప్రసాద్, తహసీల్దారు ఇన్బనాథన్, మున్సిపల్ అధికారులు విజయకుమార్, పుష్పగిరినాయక్, సురేష్ బాబు, స్నేహప్రియ, ఖాదర్‌మొహిద్దిన్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయంలో రేపు లక్ష దీపోత్సవం



రొంపిచెర్ల శివాలయం వద్ద పౌర్ణమి పూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చల్లాబాబు

రొంపిచెర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పట్టణ సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగిశెట్టినాగరాజ, ఆలయ ధర్మకర్త సుధాకర తెలిపారు. ఈమేరకు సోమవారం ఉదయం చల్లాబాబుతోపాటు స్థానిక పారిశ్రామికవేత్త ఓబులం సురేంద్రబాబు ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించి, తగిన సూచనలు ఇచ్చారు. అదే రోజు శివ పార్వతుల కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమాలు, అయ్యప్పస్వాముల భజనలు నిర్వహిస్తారన్నారు. ఈపూజల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భారత మహిళా క్రికెట్ జట్టు విజయం చిరస్మరణీయం



భారత మహిళా క్రికెట్ జట్టుకు జోహార్లు పలుకుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సదుం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దక్షిణాఫ్రికాపై భారత మహిళా క్రికెట్ జట్టు విజయం చిరస్మరణీయమని సదుం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం పేర్కొన్నారు. వన్డే వరల్డ్ కప్ విజేతగా దేశ మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించిన సందర్భంగా సోమవారం పాఠశాలలో క్రికెటర్ల ప్రతిభను కొనియాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు జేజేలు పలికారు. విద్యార్థులకు ఈ విజయం స్ఫూర్తిదాయకమని హెచ్ఎం సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



మహిళ సమస్య వింటున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పం మండల సచివాలయంలోని సమావేశపు హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటదాకా ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై అర్జీలను ఇవ్వడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు, పరిష్కారాలకోసం అర్జీలను ఇచ్చి, వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంపై సీఎం పేషీ నుంచి ఎప్పుడూ నిరంతర నిఘా ఉంటుందన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ పోటీలు



రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో అధికారులు

గంగవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు గవర్నమెంట్ హైస్కూల్‌లో సోమవారం రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవ పోటీలకు నియోజకవర్గ పరిధిలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, వీకోట మండలాల నుండి 30 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన జి.పరిణీత (గంగవరం మండలం పెద్దచల్లారిగుంట జడ్పిహైస్కూల్), యస్.హాసిని (గురుకుల పాఠశాల బైరెడ్డిపల్లె), జి.నందిని (వీకోట మండలం గందరమాకులపల్లె హైస్కూల్)లను విజేతలుగా ప్రకటించారు. వీరిని పలమనేరు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం అభినందించారు.

క్వారీ యాజమాన్యం నుంచి వ్యవసాయ భూమిని కాపాడండి



భూమి రికార్డులు చూపిస్తున్న కృష్ణప్ప

పుంగనూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) తన వ్యవసాయ భూమిని క్వారీ యాజమాన్యం దౌర్జన్యంగా లాక్కుంటున్నారని ఓ రైతు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ వేపమాకులపల్లెకు చెందిన కృష్ణప్పకు ప్రభుత్వం రాగానిపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 303/7లో 1.44ఎకరాలు పట్టా ఇచ్చినట్లు తెలిపారు. అయితే వ్యవసాయభూమి పక్కనే రూపేష్‌రెడ్డి క్వారీ నిర్వహిస్తున్నాడని, వైసీపీ పాలనలో రాజకీయ పలుకుబడితో తన వ్యవసాయభూమిని తనకు తెలియకుండా తన కుమారుడు సుబ్రహ్మణ్యంతో కొనుగోలు చేయడానికి సిద్ధపడగా తాను అడ్డుకున్నట్లు కృష్ణప్ప ఆరోపించారు. తన కుమారుడిని బెదిరించి డబ్బులు ఇచ్చినట్లు అగ్రిమెంటు రాయించుకుని మోసం చేశారని, తనకు న్యాయం చేయాలని గత తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కానీ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్పందించి తన భూమిని కాపాడి తనకు అప్పగించాలని కృష్ణప్ప కోరారు.

రాజ్యాంగ పరిరక్షణకు సహకరించాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నిఖిల్

రొంపిచెర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు అందరి సహాయ సహకారాలు అవసరమని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రొంపిచెర్లలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మండల, నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవంపై వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ, క్విజ్ నియోజకవర్గ స్థాయిలో రాణించిన రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థి పి.నిఖిల్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు. ఉపాధ్యాయులు నిఖిల్‌ను అభినందించారు.

టీటీడీ కల్యాణ మండపం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న దళిత సంఘాలు

పుంగనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలోని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపం ముందు బైఠాయించి కాంట్రాక్టర్ రవికుమార్‌రెడ్డి అవినీతికి పాల్పడుతున్నాడంటూ ఆరోపించారు. వారు మాట్లాడుతూ రవికుమార్‌రెడ్డి కల్యాణ మండపానికి అధిక ధరలు వసూలు చేస్తున్నారని టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త కాంట్రాక్టర్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు రాజన్న, నరసింహులు, రెడ్డెప్ప, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు విక్రయించడానికి స్థలం కేటాయించాలి



శమీపతికి వినతిపత్రం అందజేస్తున్న చిరు వ్యాపారులు

పుంగనూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు విక్రయించుకోవడానికి మార్కెట్ యార్డులో స్థలం కేటాయించాలని చిరు వ్యాపారస్తులు ఏఎంసీ చైర్మన్ శమీపతికి వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక మార్కెట్‌యార్డులో ఆయన్ను కలసి ఉదయం కూరగాయలు విక్రయించుకోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దీంతో చైర్మన్ మాట్లాడుతూ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో మాట్లాడి చిరు వ్యాపారస్తులకు మార్కెట్ యార్డులో స్థలం కేటాయించి రైతు బజార్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



పౌర్ణమికి ముస్తాబైన కొండ మల్లీశ్వరుడి ఆలయం

వెదురుకుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయం బుధవారం జరగనున్న కార్తీక పౌర్ణమికి ముస్తాబైంది. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వెళ్లే మార్గంలో ఈ ఆలయం ఉంది.

రేపు జరిగే పూజా కార్యక్రమాలిలా..

బుధవారం ఉదయం ఆరు గంటలకు పంచామృత రుద్రాభిషేకం. 9 గంటలకు కొండ మల్లీశ్వరస్వామి భజన బృందం ఆధ్వర్యంలో కీర్తనలు, భక్తిప్రవచనాలు. మధ్యాహ్నం 12 గంటలకు టీటీడీ వారిచే హరికథ, గాన కచేరి. 12.30 గంటలకు అన్నప్రసాదం పంపిణీ. రెండు గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం. సాయంత్రం 5.30 గంటలకు కార్తీక మహాదీపోత్సవం. సాయంత్రం ఆరు గంటలకు గిరిప్రదక్షిణ(గిరివలం). ఏడు గంటలకు అన్నప్రసాదం వితరణ.

బాలగురునాథీశ్వర ఆలయంలో 'కార్తీక' పూజలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు - పిండి దీపాలు పెడుతున్న మహిళలు

పాలసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీబొమ్మరాజుపురంలోని బాలగురునాథీశ్వర ఆలయంలో కార్తీక సోమవారం పూజలను మహిళా భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రుద్రం హోమం జరిగింది. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద పిండి దీపాలను మహిళలు వెలిగించారు. బెంగళూరు నుంచి వచ్చిన మహిళలు కోలాటం, భజనలు చేశారు. అనంతరం వనభోజనాలు ఏర్పాటు చేశారు. మండలవాసులతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి రుద్రాభిషేకం



ఆవుదేవర నందీశ్వరుడు - కొండ మల్లీశ్వరస్వామి

వెదురుకుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లి సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి పాలాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు. డీఆర్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం, రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అన్నమయ్య, శివ సంకీర్తనలు, భజనలు చేశారు. భక్తులకు అన్నదానం జరిగింది.

భక్తిశ్రద్ధలతో ప్రదోష కాల పూజలు



సదాశివేశ్వరుడికి పల్లకీ సేవ

వెదురుకుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో సోమవారం సాయంత్రం నందీశ్వరుడికి, కొండమల్లీశ్వరుడికి ఏక కాలంలో ప్రదోష కాల పూజలు చేశారు. అలాగే కార్వేటినగరంలోని శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలోనూ నందీశ్వరుడికి, సదాశివేశ్వరస్వామికి ప్రదోష కాల పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో పల్లకీ సేవ కూడా జరిగింది.

మహిళా క్రికెట్ జట్టుకు తెలుగు మహిళల అభినందనలు

చిత్తూరు సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుకు తెలుగు మహిళలు అభినందనలు తెలిపారు. వీరిలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, చిత్తూరు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు లీలావతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



గంగాధరనెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని గంగాధరనెల్లూరు హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీరిలో కార్వేటినగరం మండలం కత్తిరపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.శశిర, డీ.ఎం.పురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.గోవర్ధన్, గంగాధరనెల్లూరు మండలం కొళెపల్లె హైస్కూల్ విద్యార్థి టి.లిఖిత్ వరుసుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎంఈవో ఆంజినేయులుశెట్టి తెలిపారు. వీరిని హెచ్.ఎంలు, టీచర్లతో కలిసి అభినందించారు. గంగాధరనెల్లూరు, మేనాటంపల్లె జడ్పీహైస్కూళ్ల హెచ్ఎంలు సుబ్బరామయ్య, కేశవరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

ఎవరి ఆధీనంలోని గుడో కూడా తెలియదా జగన్?

● తెలుగు యువత

గంగాధరనెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి గుడి ఎవరి ఆధీనంలో ఉందో కూడా తెలియని స్థితిలో మాజీ సీఎం జగన్ ఉన్నారని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు పేర్కొన్నారు. అనుకోని రీతిలో జరిగిన ఘటనలో తొమ్మిది మంది మరణిస్తే దాన్ని కూటమి ప్రభుత్వంపై నెట్టడానికి జగన్‌తోపాటు వైసీపీ నేతలు పడుతున్న తాపత్రయాన్ని చూసి జనం మండిపడుతున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు చెకుముకి పోటీలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో మంగళవారం బీఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జేవీవీ జిల్లా అధ్యక్షుడు అరుణశివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు, గుడిపాల మండల పరిధిలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలైన వారికి ఈనెల 23వ తేదీన జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

బూచివానత్తంకు ఎలక్ట్రిక్ ఆటో



విజయపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బూచివానత్తం పంచాయతీలో వ్యర్థాల సేకరణకు ఎలక్ట్రిక్ ఆటోను కేటాయించారు. పీఎంఏజీవైలో భాగంగా జడ్పీ వారి సౌజన్యంతో 5.10 లక్షల ఆటోను సిబ్బందికి అందజేశారు. సర్పంచ్ గోపాల్, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

చినుకు పడితే.. బురదలో నడవాల్సిందే..!

తీవ్ర ఇబ్బంది పడుతున్న స్థానికులు - రామ్‌కాలనీలోని చివరి వీధిలో ఇదీ పరిస్థితి



బురదమయంగా ఉన్న రహదారి

చిత్తూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేరుకే నగరపాలక సంస్థ. ఇక్కడ కనీస వసతులకు నోచుకోని కాలనీలు చాలా ఉన్నాయి. 31వ డివిజన్ పరిధిలోని రామ్‌నగర్‌కాలనీ చివరి వీధి ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. వర్షం ఆగిపోయి మూడ్రోజులవుతున్నా ఇంతవరకు రోడ్లపై బురద తగ్గడం లేదు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొందరైతే జారిపడి గాయపడుతున్నారని స్థానికులు వాపోయారు. ఇకనైనా నగరపాలక అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని రోడ్డుకిరువైపులా కాల్వలను నిర్మించాలని కోరుతున్నారు.



బురదతో నిండిన రోడ్డుపై నడిచి వెళుతున్న విద్యార్థిని

మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు మెగా చెక్ అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్, ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవకారుణ్య అన్నదాన సమాజం ఆధ్వర్యంలో విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్పులను పంపిణీ చేశారు. సోమవారం చర్చివీధిలోని జీవకారుణ్య అన్నదాన సమాజంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు విద్యార్థులకు మెగా చెక్ అందజేశారు. 100 మంది విద్యార్థులకు రూ.2.25 లక్షల స్కాలర్‌షిప్పులు ఇవ్వడం అభినందనీయమన్నారు. అలాగే అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఈవో తిమ్మారెడ్డి, నేతలు చల్లా బాబు, వెంకటేష్ యాదవ్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే భానుప్రకాష్ పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న భానుప్రకాష్

విజయపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలపాకానికి చెందిన టీడీపీ నాయకుడు శరవణ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆయన్ను సోమవారం నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ పరామర్శించారు. అనంతరం కేశవపురంలో ఇటీవల వివాహమైన కొండూరు దాము దంపతులను ఆశీర్వదించారు. కోసలనగరంలో భాస్కర్ కుటుంబాన్ని పలకరించారు. కేశవపురం ఆది ఆంధ్రవాడలో అనారోగ్యంతో ఉన్న కృష్ణయ్యను పరామర్శించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నాయకులు హరికృష్ణ, బాషా, బెంజిమన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో వేగంగా కాజ్‌వే పనులు



పనులను పర్యవేక్షిస్తున్న గంధమనేని రాజశేఖర్ నాయుడు

శ్రీరంగరాజపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత నెలలో వచ్చిన తుఫాన్ కారణంగా క్షీరసముద్రం-జీఎంఆర్‌పురం మధ్య వాగు పొంగింది. దీనివల్ల కాజ్‌వే దెబ్బతిని ఎనిమిది గ్రామాలవారు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆయన గత నెల 28వతేదీన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఈ కాజ్‌వేని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే కాజ్‌వే పనులు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలిచ్చారు. వేగంగా జరుగుతున్న ఈ పనులను సోమవారం జిల్లా టీడీపీ కార్యవర్గ సభ్యుడు గంధమనేని రాజశేఖర్ నాయుడు పర్యవేక్షించారు. సమస్యను పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకి, కలెక్టర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌టీఏ నగర అధ్యక్షురాలిగా దేవకి



చిత్తూరు సెంట్రల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) చిత్తూరు నగర అధ్యక్షురాలిగా సి.దేవకిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు ప్రకటించారు. దుర్గానగర్ కాలనీలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎం.లావణ్య, గౌరవ అధ్యక్షురాలిగా వి.గీతాంజలి, ఆర్థిక కార్యదర్శిగా ఎన్.రుక్మాంగధ, సహాధ్యక్షులుగా జి.ప్రసూనకుమారి, కె.జోష్నను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఎ.రంగనాయకమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.శ్రీనివాసులు, పి.గిరిజలను ఎన్నుకున్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎం.బాబురెడ్డి, సభ్యులు ఎన్‌వీ సుధీర్ పాల్గొన్నారు. రాయచోటిలో ఈనెల 8వ తేదీన నిర్వహించే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థినికి నగదు బహుమతి



యాదమరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాలలో 561 మార్కులు సాధించిన కె.పల్లవికి రూ.20వేల నగదు బహుమతిని రిటైర్డు టీచర్ కృష్ణారెడ్డి అందజేశారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ బహుమతి అందజేస్తున్నట్లుతెలిపారు. ఆయాలుజయంతి,ధనమ్మ,మమత, తాహెరా, హరిలను సన్మానించారు. హెచ్ఎం ఇ.హేమలత, టీచర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తాం: తహసీల్దార్

వెదురుకుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు తెలిపారు. సోమవారం కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ఎనిమిది వినతిపత్రాలు వచ్చాయని తహసీల్దార్ చెప్పారు.

విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

నగరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మండల స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పరిమళ, సోఫియా, విజయకుమార్‌లకు పోటీలు నిర్వహించగా, రాష్ట్ర స్థాయి పోటీలకు పరిమళ ఎన్నికయ్యారని ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయ తెలిపారు. టీచర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రకృతి మేళాలో హరికృష్ణారెడ్డి



పెనుమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలానికి చెందిన ప్రముఖ ప్రకృతి రైతు హరికృష్ణారెడ్డి ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ప్రకృతి మేళాలో పాల్గొన్నారు. కేంద్ర వ్యవసాయ సంక్షేమశాఖ అధ్వర్యంతో జరిగిన ఈ మేళాలో ఆయన వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతంపై సూచనలు చేస్తూ, దేశ భవిష్యత్తు వీటిపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



గాయపడ్డ కిరణ్‌కుమార్

వెదురుకుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్వేటినగరం మండలం కత్తెరపల్లె ఏఏడబ్ల్యూకు చెందిన కిరణ్ కుమార్(34) కార్వేటినగరం వైపు నుంచి స్వగ్రామానికి బైక్‌లో సోమవారం రాత్రి వస్తున్నాడు. కార్వేటినగరం సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడ్డారు. తీవ్రంగా గాయపడటంతో అతడిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు.

ప్రమాదాలకు నిలయంగా కల్వర్టు



గొడ్డు వంక కల్వర్టుపై ప్రవహిస్తున్న నీరు

తవణంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జొన్నగురకల గ్రామ సమీపంలో ఉన్న గొడ్డు వంకపై ప్రజలు రాకపోకల నిమిత్తం తూములు లేని కల్వర్టు నిర్మించారు. గత నెలలో కురిసిన వానలకు ఈ వంకలో నీరు ప్రవహిస్తుండడంతో కల్వర్టుపై పాచి పట్టింది. ఆటోలు, ద్విచక్రవాహనాలు జారుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొందరు గాయపడ్డారు. వాహనాలూ ధ్వంసమయ్యాయి. కల్వర్టు సమీపంలో హెచ్చరిక బోర్డులు పెట్టి, తూములు ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

బురదమయంగా రహదారులు

● ఇబ్బంది పడుతున్న స్థానికులు



వేణుగోపాలపురంలో బురదతో నిండిన రహదారి

యాదమరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు మండలంలోని పలు గ్రామాల రహదారులు బురదమయంగా మారాయి. మండలకేంద్రంలోని వేణుగోపాలపురం, ఇందిరమ్మకాలనీల్లో రోడ్లు మరింత దారుణంగా ఉన్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల దుస్థితిపై ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎవరో చేసిన తప్పునకు మాకెందుకీ శిక్ష: రైతుల ఆవేదన



గొల్లకండ్రిగ వద్ద చెరకు తోటలో నిలిచిన మొరవ నీరు

విజయపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎవరో చేసిన తప్పునకు ప్రతి ఏడాదీ తాము శిక్ష అనుభవించాల్సి వస్తున్నదని గొల్లకండ్రిగకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లకండ్రిగలోని ఇష్టకామేశపురం చెరువు నిండిన ప్రతిసారీ మొరవ పారుతుంది. ఈ మొరవ నీరు పారుదలకు వీలుగా కాలువతోపాటు ఓ పైపులైను ఏర్పాటు చేశారు. అయితే తిరుత్తణి - నాగలాపురం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పైపులైను ధ్వంసమైంది. అప్పటి కాంట్రాక్టరు ఈ పైపులైను తొలగించేసి రోడ్డు నిర్మించేశాడు. అప్పటి నుంచి ప్రతి ఏడాదీ మొరవ నీరు పారుదల లేక పక్కనున్న పొలాల్లోనే నిలబడిపోతోంది. దీనివల్ల పంటలు నాశనమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళితే తగిన చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ ఏడాదైనా సమస్య పరిష్కారం అవుతుందేమోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

సంక్షిప్తంగా..

నేడు థామస్ పర్యటన

పాలసముద్రం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వవిప్ థామస్ మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపీడీవో సతీష్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ



చిత్తూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఎస్పీతుషార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

గుడిపాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌లో అందే అర్జీలపై సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల కేంద్రానికి బాధితుల ఉదయం 12 గంటల్లోపు వస్తే వారి సమస్యలను పరిష్కరించే వీలుంటుందని తెలియజేయాలన్నారు.

ప్రతి వీధికీ సిమెంటు రోడ్డు

పెనుమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వీధికీ సిమెంటు రోడ్డు వేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహసీల్దారు శ్రావణ్ కుమార్ తెలిపారు. సోమవారం వారు సీఆర్ కండ్రిగలో రూ.16 లక్షలతో పొదలకొండ గ్రామంలో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డును పరిశీలించారు. ఆర్ఐ మనోజ్, ఏపీవో గుణశేఖర్, జూనియర్ అసిస్టెంట్ అయ్యప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జోషిత్ పాల్గొన్నారు.

7న గంగాధర నెల్లూరు మండల మీట్

గంగాధరనెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల ఏడో తేదీన ఉదయం 10గంటలకు ఎంపీడీవో ఆఫీస్‌లో ఎంపీపీ అబ్బూ అనిత అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, హాజరు కావాలని కోరారు.

బెల్ టవర్ నిర్మాణానికి క్రైస్తవుల ప్రార్థనలు

గంగాధరనెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అగ్రహారం దళితవాడ చర్చిలో కొత్త బెల్‌టవర్ నిర్మాణానికి సోమవారం క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఉపదేశకుడు జీవరత్నం ఆధ్వర్యంలో రెవరెండ్ జాన్‌వీన్, తూగుండ్రం పాస్టరేట్ ట్రెజరర్ శాంతకుమార్, కార్యదర్శి రవి, ఉపదేశకులు దేవేంద్రన్, సభామణియం సుబ్రహ్మణ్యం, సత్య, వెంకటేష్, క్రైస్తవులు పాల్గొన్నారు.

కాళీమాత ఆలయ కుంభాభిషేక పూజలు

గంగాధరనెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలగంగనపల్లెలోని కాళీమాత ఆలయ కుంభాభిషేక పూజలను సోమవారం నిర్వహించారు. ఈ పూజలకు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, గంగాధరనెల్లూరు, సత్యవేడు వైసీపీ ఇన్‌చార్జిలు కృపాలక్ష్మి, నూకతోటి రాజేష్, బాలగంగనపల్లె సర్పంచ్ శేఖర్, ఎంపీపీ అనిత, వైసీపీనేతలు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి: సీఐ

వెదురుకుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రోడ్డు నియమాలను పాటించాల్సిందేనని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. సోమవారం కార్వేటినగరంలో మీడియాతో మాట్లాడారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. ట్రాక్టర్లను వెనుకవైపు కచ్చితంగా రేడియం స్టిక్కర్లను అతికించాలన్నారు. బైక్‌రైడర్లు హెల్మెట్‌లను ధరించాలన్నారు. లేదంటే జరిమానాతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.